క్లుప్తంగా

రూ.1.7 లక్షల రికవరీకి ఆదేశం



సామాజిక తనిఖీ బహిరంగ సభలో పాల్గొన్న అధికారులు

ఓడీచెరువు: ఉపాధి హామీ పనులకు సంబంధించి బాధ్యుల నుంచి రూ.1.7 లక్షలు రికవరీ చేయాలని ఉన్నతాధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ శివరాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం నిర్వహించారు. డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, అంబుడ్స్‌మన్ వెంకటశివారెడ్డి, ఏపీడీ జ్యోతి, స్టేట్ టీం లీడర్ లోకేష్‌రెడ్డి హాజరయ్యారు. మండల వ్యాప్తంగా 2024–25 సంవత్సరానికి సంబంధించి 1,740 పనులకుగాను వేతనాలకు 7.63 కోట్లు, మెటీరియల్‌కు గాను 4.08 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్భంగా తనిఖీ బృందం సభ్యులు వివరాలను వెల్లడించారు. మొత్తం 11.71 కోట్లకుగాను రూ.1.7 లక్షలు అక్రమాలు జరిగినట్లు తెలియజేశారు. దీంతో ఉన్నతాధికారులు బాధ్యుల నుంచి సదరు మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ నీలకంఠ, ఏపీఓ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు

సమాచార హక్కు చట్టం పక్కాగా అమలు చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: సమాచార హక్కు చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని శుక్రవారం ఆర్డీఓ వీవీఎస్ శర్మకు సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పౌర సమాచార అధికారుల పేర్లు, నూతనంగా వచ్చిన అధికారుల పేరు స్పష్టంగా బోర్డుల్లో ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక కదిరి డివిజన్ అధ్యక్షులు శ్యామ్‌కుమార్, ఈశ్వరప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



లింగన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బత్తలపల్లి: అప్పరాచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొండారుపల్లి ఈశ్వరయ్య తండ్రి లింగన్న(88) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు గ్రామానికి చేరుకుని లింగన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులు ఈశ్వరయ్య, పోతలయ్యను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సర్పంచు సానే జయచంద్రారెడ్డి, గుర్రం నరసింహారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి, రాజవీరారెడ్డి, బండి వీరనారప్ప, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



శిక్షణకు హాజరైన బూత్ లెవెల్ అధికారులతో ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి అర్బన్: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మ బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మూడో రోజు బీఎల్‌ఓలకు ఓటరు జాబితా నిర్వహణపై శిక్షణ కొనసాగించారు. ఈసందర్భంగా ఆర్డీఓ, శిక్షణ అధికారులు ఓటరు జాబితా తయారీలో బీఎల్‌ఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. తప్పుల్లేని జాబితా తయారు చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ రవికుమార్, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, రెవెన్యూ సిబ్బంది విజయ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నపల్లోల్లపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు



పెద్దయల్లంపల్లి మలుపు వద్ద ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా!

- ప్రమాదాలకు నెలవుగా రహదారి మలుపులు
- జాతీయ రహదారిపై గుంతలతో ప్రమాదాలు
- రోడ్ల మార్జిన్లలో పేరుకుపోయిన తుప్పలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

నల్లచెరువు: మండలంలో జాతీయ రహదారిపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. రహదారుల్లో ప్రమాద హెచ్చరికలు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో రోడ్లపై ప్రయాణం చేసేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు ప్రాణాల కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో రహదారిపై ప్రయాణం చేయాలంటేనే భయాందోళనకు గురువుతున్నారు.

ప్రమాదాలు మచ్చుకు కొన్ని..

పెద్దయల్లంపల్లి సమీపంలో హైవేపై గుంత ఏర్పడింది. గుంతను గమనించకుండా గత నెల 24 వతేదీన ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయిన పాల వ్యాన్ టైర్ ఒక్కసారిగా గుంతలోకి దిగడంతో వ్యాన్ అదుపుతప్పి పక్కనే ఉన్న మోరీ గుంతలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

పాత రైల్వే స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారి దెబ్బతిని ఎత్తు పల్లంగా ఉండడంతో ఈ నెల 8వ తేదీన అరటి పండ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం, ఆ మరుసటి రోజు అదే రోడ్డుపై టమాటాల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు.

మే నెల 11వ తేదీన మండలంలోని పెద్దయల్లంపల్లి వద్ద ఉన్న మలుపు వద్ద ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మదనపల్లికి చెందిన ముగ్గురు విశ్రాంత ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. అప్పటికప్పుడు అధికారులు ఆ మలుపువద్ద స్పీడ్ నియంత్రణ బోర్డు ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా మలుపులు

మండలంలోని రాత్నాళ్లపల్లి, పాత రైల్వే స్టేషన్, పెద్దయల్లంపల్లి, చిన్నపల్లోల్లపల్లి, యర్రగుంటపల్లి గ్రామాల వద్ద ఉన్న జాతీయ రహదారిపై మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. డ్రైవర్ ఆదమరిస్తే ప్రమాదంలో పడినట్లే ఈ మార్గంలో మలుపులతోపాటూ రోడ్డు మార్జిన్లపై చెత్త, తుప్పలు ఉండంతో డ్రై వర్లు అజాగ్రత్తగా ప్రయానం చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పెద్ద ప్రమాదాలు జరగక ముందే మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పటు హైవేపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

హైవేపై ప్రమాదకరంగా మలుపు



పెద్దయల్లంపల్లి వద్ద హైవేపై మలుపు ప్రమాదకరంగా ఉంది. హైవే కావడంతో వాహనాలు వేంగా వస్తుంటాయి. ఇక్కడ చాలా సారు చిన్న చిన్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. హైవేపై ఏర్పడిన గుంతను గమనించకుండా వేగంగా వచ్చి బైకులు అదుపుతప్పి కిందపడి చాలామంది ఆసుపత్రి పాలయ్యారు. పెద్ద ప్రమాదాలు జరగక ముందే దెబ్బతిన్న రోడ్డును మరమ్మతులు చేసి మలుపుల వద్ద సూచికలు ఏర్పటు చేయాలి.

– నరేంద్ర నాయుడు, పెద్దయల్లంపల్లి, నల్లచెరువు, మండలం



పాత రైల్వే స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై బోల్తా పడిన బొలెరో వాహనం

స్పీడ్ బ్రేకర్లు కొత్తవి ఏర్పాటు చేయాలి



దేవిరెడ్డి పల్లి సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు దెబ్బతిన్నాయి. హైవేపై వెళ్లే వాహనాలు వేగాన్ని నియంత్రించుకోకుండా అతి వేగంగా వెళ్తున్నాయి. విద్యార్థులు పాఠశాల ముగియగానే తమ ఇళ్లకు వెళ్లాలనే ఆత్రుతతో వాహనాలను గమనించకుండా రోడ్డు దాటుతుంటారు. ఈ క్రమంలో ప్రమాదాలకు గురైయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. గతంలో ఏర్పాటు చేసి వాటిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

–జి. రామాంజనేయులు, నల్లచెరువు మండలం

'యువగళం' హామీలు నెరవేర్చాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుట్టపర్తి టౌన్: యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేషం మహేంద్ర, నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి చెల్లిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అయితే 14 నెలలు కావొస్తున్నా బకాయిలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే 77 జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పీజీ అడ్మిషన్లు రద్దు చేస్తామని చెప్పినా ఇంతవరకూ ఆచరణకు నోచుకోలేదన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు, పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. నాయకులు అభిలాష, గణేష్, సాయిప్రదీప్, ప్రకాశ్, సిద్దిక్, ఆదర్శ్, జగన్మోహన్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఈయూ ధ్యేయం



జెండా ఆవిష్కరిస్తున్న ఈయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: కార్మికుల సంక్షేమమే ఎంప్లాయీస్ యూనియన్ ధ్యేయమని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పుట్టపర్తి ఆర్టీసీ డిపో వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూనియన్ 74 ఏళ్లలో ఎన్నో కార్మికుల సమస్యలు పరిష్కరించిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియతో యూనియన్ ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో రీజనల్ కోశాధికారి రమణప్ప, మహిళా నేత రుక్మిణి, సీనియర్ నాయకులు ఏఎస్‌జె రెడ్డి, డిపో సెక్రటరీ సాదిక్‌పీరా, డిపో అధ్యక్షుడు రమేష్ బాబు, నాయకులు ఆనంద్, బాబు, ఆదెన్న, పెద్దన్న, నాగార్జున, కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. యూనియన్ డిపో కార్యదర్శి జె.ముస్తఫా అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర నేత కేవీ నాగార్జునరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం నాయకులు 74 ఏళ్ల నుంచి యూనియన్ కార్మికుల కోసం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను గురించి గుర్తు చేసుకున్నారు. రీజినల్ నాయకులు నరసింహులు, బిల్లే ఆదినారాయణ, ఏడీసీ మల్లికార్జున, డిపో అధ్యక్షులు తిరుమలేష్, గ్యారేజీ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు ఎల్‌హెచ్ కుమార్, ఎస్ఎస్ఎస్ వలి, నజీర్ సాహెబ్, సుమోశీన, బాబు, రామకృష్ణ, శంకర్, రిటైర్డ్ అసోషియేషన్ నాయకులు సూరీడు, మిస్త్రీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఇలా.. నడిచేదెలా?



ఫుట్‌పాత్‌పై ఉన్న స్తంభాలు, చెట్లు

- విద్యుత్ స్తంభాలు, వృక్షాల మధ్యలో ఏర్పాటు
- రూ.10 లక్షల ప్రజాధనం వృథా

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి పట్టణం నుంచి గణేష్ సర్కిల్‌కు వచ్చే ప్రధాన రహదారి పక్కన స్థానిక ఆర్టీసీ బస్ డిపో వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫుట్‌పాత్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ప్రధాన రోడ్డు రద్దీగా ఉన్న సమయంలో సత్యసాయి బాబా భక్తులు, ప్రజలు నడవడానికి వీలుగా సుమారు 240 మీటర్ల పొడవునా నడకదారి ఏర్పాటు చేస్తున్నారు. ఇదంతా సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా నిర్మిస్తున్నారు. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా సదరు ఫుట్‌పాత్ మధ్యలో 9 విద్యుత్ స్తంభాలు, 3 వృక్షాలున్నాయి. దీని నిర్మాణం కోసం మున్సిపాలిటీ రూ.10 లక్షలు ఖర్చు చేస్తోంది. ఫుట్‌పాత్‌తో పాటు విద్యుత్ వెలుగుల కోసం దీపపు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. సదరు ఫుట్‌పాత్‌పై జనం ఆదమరచి నడిస్తే విద్యుత్ స్తంభాలను, చెట్లను ఢీకొనే ప్రమాదం ఉంది. అనుకోకుండా విద్యుత్ స్తంభాలకు విద్యుత్ ప్రసారం జరిగితే పెను ప్రమాదం జరగవచ్చని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ లాభం కోసం ఇలాంటి పనులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు ఫుట్‌పాత్ పక్కనే నిత్యం జిల్లా అధికారులు చూస్తూ వెళ్తున్నా ఇంత వరకూ ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై కమిషనర్ క్రాంతిని వివరణ కోరగా గత కమిషనర్ హయాంలోనే పనులు ప్రారంభించారని తాను చేసిందేమి లేదని చెప్పొకొచ్చారు.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఘన సన్మానం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని సత్కరిస్తున్న చెలిమి రామయ్య, నాయకులు

ధర్మవరం: ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చెలిమి రామయ్య ఆధ్వర్యంలో గరుడంపల్లి, వసంతపురం, చిగిచెర్ల, ఉప్పునేసినవల్లి గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని గజమాలతో సత్కరించారు. పార్టీలో రాష్ట్ర కమిటీలో అవకాశం దక్కేలా కృషి చేసిన కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చెలిమి రామయ్య మాట్లాడుతూ పార్టీలో ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా బీసీ వర్గంలో తమకు రాష్ట్ర కమిటీలో చోటిచ్చి మాజీ ఎమ్మెలే కేతిరెడ్డితో పాటు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతిగా నిలిచారన్నారు.వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి, ఓబిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శేఖర్, గురుమూర్తి, రామచంద్ర, నారాయణస్వామి, కాశప్ప, గాంధీ, మల్లేష్, తిక్కయ్య, తలారి రవి, మాధవయ్య, నాగార్జున, వన్నూరప్ప, కాశప్ప, అశోక్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి చెలిమి రామయ్యను శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. గరుడంపల్లిలో రామయ్య స్వగృహంలో ఆయన్ను మండల కన్వీనర్ పోతుకుంట రామయ్య, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రెడ్డి, వెంకటేష్, ప్రభాకర్, ఎంపీటీసీ భర్త కొండా, సురేంద్రరెడ్డి, అంగజాల ఓలయ్య,మార్కెండేయ,వినోద్, వీరనారప్ప తదితరులు కలిసి సత్కరించారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం హనుమాన్ సర్కిల్ నుంచి గణేష్ కుడలి వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీఓ 30 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను ఇంజినీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, హెల్త్, రిస్క్ అలివెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తామని ప్రకటించారు. నాయకులు గంగాద్రి, రమణ, రమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ నియామకం

కనగానపల్లి: కనగానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)కి కొత్తగా త్రిసభ్య కమిటీని నియమించారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న కొన్ని సహకార సొసైటీలకు గతంలో ఉన్న త్రిసభ్య కమిటీలు రద్దు కావటంతో వాటి స్థానంలో కొత్తగా త్రిసభ్య కమిటీలను నియమించినట్లు జిల్లా పీఏసీఎస్ బ్యాంకు అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో కనగానపల్లి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నెట్టం వెంకటేసులు, కమిటీ సభ్యులుగా మామిళ్లపల్లి దేవరాజు, మద్దెలచెరువు రామకృష్ణను నియమించారు.

చేనేతలను ఆదుకోవాలి

సోమందేపల్లి: కూటమి ప్రభుత్వం చేనేతలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని చేనేత సంఘం మండల కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం ద్వారా కార్మికులకు రూ.24 వేలు చొప్పు ఆర్థిక సహాయం అందిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరుతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. చేనేతశాఖ మంత్రి సవిత చేనేతల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు విరాళం

ఓడీచెరువు: మండలంలోని కొండకమర్ల ఉన్నత పాఠశాలలో సమావేశ వేదిక నిర్మాణానికి కొండబోయిన సతీష్ శుక్రవారం రూ.50 వేలు విరాళం అందించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జనాభా పెరుగుదలతో సమస్యలు

హిందూపురం టౌన్: యువశక్తే దేశాభివృద్ధిని సూచిస్తే జనాభా పెరుగుదల ఎన్నో సమస్యలకు కారణమవుతుందని ఎస్ఎస్‌బీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అన్నారు. ఆ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, రాజనీతి శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ సరస్వతి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రవినాయక్ పాల్గొన్నారు.

రొద్దం: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన వీధుల్లో డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌హెచ్ఓ శశికళ బాధ్యతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య,ఆరోగ్య సిబ్బంది

ముదిగుబ్బ: ఎనుములవారిపల్లిలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవంపై మలకవేమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య,ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీటి రోజా బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను తెలియజేశారు. సీజనల్ వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి దేవాలనాయక్, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ మంజుల, ఎంపీహెచ్ఎస్ అలివేలమ్మ, రవి శంకర్, శశిధర్, హరినాథ్‌రెడ్డి, పార్వతమ్మ, సరస్వతి, సీహెచ్ఓ జ్యోతి, మీన, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐచర్ వాహనానికి నిప్పు



కాలిపోయిన ఐచర్ వాహనం

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామ సమీపంలో ఐచర్ వాహనానికి దుండగులు నిప్పు పెట్టినట్లు వాహన యజమాని జయరాం తెలిపారు. బ్రహ్మసముద్రం నుంచి వాహనంలో మొక్కజొన్న గడ్డి హిందూపురానికి తీసుకెళ్తుండగా ఐచర్ మరమ్మతుకు గురి కావడంతో గురువారం రాత్రి వాహనం అక్కడే నిలిపి వేసి డ్రైవర్, మరోవ్యక్తి గ్రామానికి చేరుకున్నారన్నారు. అయితే శుక్రవారం ఉదయం వాహనం కాలిపోతున్నట్లు మండ్లి గ్రామస్తులు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొనేలోపే అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైందన్నారు. వాహనాన్ని కాలువలోకి తోసేసి దుండగులు నిప్పు పెట్టారని వాపోయారు.

విద్యా సామగ్రి పంపిణీ



స్కూల్ బ్యాగ్స్ చూపుతున్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఆమిదాలకుంట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 21 మంది విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కేశాపురానికి చెందిన రమేష్‌రెడ్డి సహకారంతో భగవాన్ సత్యసాయి బాబా భక్తుడు స్కూల్‌బ్యాగ్స్, పలక, నోటుబుక్స్ సమకూర్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏఎన్ ఓబుళేసు ఆధ్వర్యంలో రమేష్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ రామాంజనేయులు చేతుల మీదుగా విద్యా సామగ్రి అందజేశారు. ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి టౌన్: ఈనెల 27,28 తేదీల్లో కదిరిలో జరిగే సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్.నరసింహులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం తమ పార్టీ నీతి,నిజాయితీగా పని చేస్తోందన్నారు. జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. మహాసభల్లో రైతులు, కార్మికులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, సాంబశివ, జగన్మోహన్, ముస్తక్, అలీ, రామ్మోహన్, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.